సాక్షి చిత్తూరు

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



ఇంట్లో చోరీ..
పలమనేరు పట్టణ సమీపంలోని ఓ ఇంటిలో రూ.2 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. - 8లో



వరసిద్ధుడి సేవలో రైల్వే ఐజీ
కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఐజీ పూజలు చేశారు. - 8లో



సకాలంలో వ్యవసాయ సర్వీసులు
సకాలంలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు అర్బన్: ఈ వేసవిలో తొలిసారిగా చిత్తూరులో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు 32 డిగ్రీలున్న ఉష్ణోగ్రత.. మధ్యాహ్నం 1.30 గంటలకు ఏకంగా 40 డిగ్రీలకు చేరుకుంది. సాయంత్రం 6 గంటలకు సైతం 34 డిగ్రీలున్న వేడిమి.. రాత్రి తొమ్మిది గంటలకు కొద్దిగా చల్లబడి 28 డిగ్రీలకు చేరుకుంది. గతేడాది ఇదే తేదీన చిత్తూరులో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మున్ముందు ఉష్ణోగ్రత మరింత పెరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని నిపుణులు చెప్పారు.

ప్రజారోగ్యాన్ని కాపాడడమే లక్ష్యం



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్

ఐరాల : ప్రజారోగ్యాన్ని కాపాడడమే ధ్యేయంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ, ఎయిడ్స్, క్షయ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ వెంకట్‌ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. క్షయ, కుష్టు రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రారంభ దశలోనే గుర్తించి వారికి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నియంత్రించవచ్చన్నారు. ఆ దిశగా క్షేత్రస్థాయిలో సర్వే పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కుష్టు వ్యాధిపై అపోహలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, పీహెచ్ఎన్ జీవకళ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఎస్వీయూ ‘డిస్టెన్స్’ చూచిరాతలు

– డిగ్రీ, పీజీ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్




పరీక్షలు రాస్తున్న డిగ్రీ, పీజీ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : కొద్ది రోజులుగా ఎస్వీయూ డిస్టెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ, పీజీ పరీక్షలు యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ కొనసాగుతోంది. ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ, పీజీ పరీక్షల్లో చూచిరాతల పర్వం అక్రమ వసూళ్ల దందాకు తెరలేపుతోంది. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ వ్యవహారం గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. అంతేకాదు డబ్బులు ఇవ్వని విద్యార్థులను ఒక విధంగా, ఇచ్చిన విద్యార్థులకు చూచిరాతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ విషయాన్ని పరీక్షలు రాసిన పలువురు విద్యార్థులు వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. చూచిరాతల కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.1500 నుంచి 3 వేల వరకు వసూళ్లు చేశారని సమాచారం. జిల్లా కేంద్రంలోని పేరొందిన సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో మాస్‌కాపీయింగ్ తతంగం జరగడం విమర్శలకు తావిస్తోంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఓ అధ్యాపకుడు ఈ తతంగం మొత్తం నడిపిస్తున్నట్లు తెలిసింది.

చీటీలు దొరికినా చర్యలు శూన్యం



పరీక్షల నిర్వహణలో ఏవరైనా చూచిరాతలకు పాల్పడి దొరికిపోతే వారి పై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో చూచిరాతలకు పాల్పడుతూ దొరికిపోయిన పలువురు విద్యార్థుల పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ వెల్లడించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే విద్యార్థులను డీబార్ చేసే అధికారం లేదని ఆయన సమాధానం చెప్పడం గమనార్హం.



తమ్ముళ్లకు యంత్ర సాయం

ఏ పథకం వచ్చినా మొదట తమ్ముళ్ల కడుపు నిండుతోంది. తరువాతే మిగిలిన రైతులకు అందజేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఏ పథకానికి దరఖాస్తు చేసినా జాబితా నేరుగా సంబంధిత కూటమి నేతలకు చేరిపోతోంది. ఇంకేముంది..పల్లెల్లో ఇక వారి సిఫార్సు ఉంటేనే పథకాలు అన్నదాతలకు అందుతాయి. మనసు చంపుకొని వారి వద్దకు వెళ్తేనే రాయితీ కానీ మరో పథకమైనా దక్కుతుంది..కూటమి పాలనలో పారదర్శకతకు పాతరేశారు..గతంలో వైఎస్సార్‌సీపీ పాలనలో కులం, మతం, వర్గం, పార్టీ చూడకుండా పథకానికి అర్హులైతే చాలు..ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించేవారు..నేడు పథకాలకు తమ్ముళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే గాని అందని పరిస్థితులు దాపురించాయి.

- యూరియా, సీడ్స్ ఏమొచ్చినా ముందుగా పచ్చనేతలకే..
- పథకమేదైనా లిస్ట్ సంబంధిత లీడర్లకు ఇవ్వాల్సిందే
- దరఖాస్తుదారుల జాబితా కూటమి నేతల జేబులో..
- వ్యవసాయశాఖ రాయితీ పథకాల్లో సాగుతున్న తీరు

పలమనేరు : జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా వచ్చినా ముందుగా కూటమి నేతలకు చేరాల్సిందే. ఆపై మిగిలిన వాటిని అవసరం ఉన్న రైతులకు అందజేస్తున్నారు. రాయితీతో అందే విత్తనాలు, హార్టికల్చర్ ద్వారా అందే నర్సరీ నార్లు ఇలా రాయితీ పథకాలేవైనా ముందు తమ్ముళ్లకు ఆపైనే రైతులకనే విధంగా మారింది. దీంతో తటస్థంగా ఉన్న లేదా వైఎస్సార్‌సీపీ సానుభూతి రైతులకు వ్యవసాయ, ఉద్యానశాఖలకు సంబంధించిన రాయితీ పథకాలకు సూటిపోటి మాటలు, అవమానాలు తప్పడం లేదు.

రాయితీ పరికరాలకు నిబంధనలు ఇలా..

ఎస్ఎంఏఎం పథకంలో 17 శాతం ఎస్సీలు, 8 శాతం ఎస్టీలు మిగిలిన శాతం బీసీ, ఓసీలోని సన్న, చిన్నకారు రైతులకు అందివ్వాలి. గత ఐదేళ్లలో వ్యవసాయ పరికరాలను పొందని రైతులుగా ఉండాలి. ఆ మేరకు ఇప్పటికే పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు ముందుగా ఆర్ఎస్‌కే లాగిన్ ఆపై ఏవో లాగిన్ నుంచి డీఏవో లాగిన్ ద్వారా ఎంపికలు జరుగుతాయి. ఎంపికైన రైతులు సంబంధిత పరికరం ధరలో 50 శాతం డబ్బును సంబంధిత కంపెనీకి చెల్లించి ఆ కంపెనీ ద్వారానే పరికరాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

జాబితాలు కూటమి నేతల జేబుల్లోకి...

ఆన్‌లైన్‌లో నమోదైన లబ్ధిదారుల జాబితాలు ఆయా మండలాల్లోని పంచాయతీ స్థాయి నాయకుల జేబుల్లోకి ఇప్పటికే చేరాయి. వీటిని అధికారులు ఎందుకిచ్చారో ఎవరి ఆదేశాలతో ఇచ్చారో అర్థంకావడం లేదు. పారదర్శకంగా సాగాల్సిన వ్యవసాయశాఖ పథకాల పంపిణీలో రాజకీయ జోక్యం నెలకొంది. జాబితా జేబులో పెట్టుకున్న కూటమి చోటా నేతలు లబ్ధిదారులను చూడగానే జాబితా ఉందన్నా ఇవ్వాలా వద్దా అనే మాట వినిపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలువురు రైతులు ఇదేమీ కర్మరా సామీ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ చేస్తాం..



పథకాలను అర్హులైన వారికి అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు , యంత్రాల పంపిణీ కోసం ఆసక్తి గల రైతుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరాం. ఆయా పంచాయతీల్లో కూటమి నేతలకు లబ్ధిదారుల జాబితా ఎలా వెళ్లిందనే దానిపై విచారణ చేస్తాం. దీనిపై జిల్లా స్థాయిలో ఏఓలతో స్పష్టమైన ఆదేశాలను ఇస్తాం. అర్హులైన రైతులకు పార్టీలతో సంబంధం లేకుండా సబ్సిడీ పరికరాలను అందజేస్తాం.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి, చిత్తూరు

రూ.2.84 కోట్లతో 1645 రకాల పరికరాలు

చిత్తూరు జిల్లా వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో 2024–25 ఏడాదికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ పథకమైన ఎస్ఎంఏఎం(ది సబ్ మిషన్ ఆఫ్ అగ్రికల్చరల్ మెకనైజేషన్)లో రూ.2.84 కోట్ల నిధుల ద్వారా ప్లాంట్ ప్రొటెక్షన్ పరికరాలైన మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ బేస్డ్ బూమ్‌టైప్ స్ప్రేయర్లున్నాయి. ట్రాక్టర్ డ్రాన్ పరికరాల్లో కల్టివేటర్లు, డిస్కపడల్స్, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్స్ తదితరాలున్నాయి. ఇక సెల్ఫ్ ప్రొఫెల్లెడ్ పరికరాలు మొత్తం 1645 పరికరాలను జిల్లాలోని రైతులకు 50 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాల్సి ఉంది.



రాయితీపై వ్యవసాయ శాఖ పంపిణీ చేస్తున్న పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ బేస్డ్ పరికరాలు

పేదల కడుపు కొట్టడమేనా సంపద సృష్టి?

– మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం : ఉన్న వాటిని ఊడగొట్టి.. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా పేదల కడుపు గొట్టేదేనా సంపద సృష్టి అని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. మాజీ సీఎం జగనన్న ఇస్తున్న పథకాలను తుంగలో తొక్కి ఇప్పుడు కుంటి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. మంగళవారం ఆయన పుత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయించడం , దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు దుయ్యబట్టారు. సంపద సృష్టి అంటే కులాలు, మతాలకు అతీతంగా పేద వాళ్ల జీవన ప్రమాణాల మెరుగునకు చేపట్టే పథకాల ద్వారా వచ్చే ఫలితాలని తెలిపారు. నాడు జగనన్న అమలు చేసిన పథకాలు ఇందుకు నిదర్శనమని గుర్తు చేశారు. నేడు దోపిడీలు, దోచుకోవడాలు, పథకాలను ఎగ్గొట్టడాలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. పేదల సంజీవిని ఆరోగ్య శ్రీని దశల వారిగా నిర్వీర్యం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. విద్య, వైద్య రంగాలను పేద ప్రజలకు అందకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 10 నెలలుగా జరుగుతున్న ఇసుక, గ్రావెల్ దోపిడీలను అరికట్టాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. అధికారం లేదని ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజి, నాయకులు లోకనాథ, వెంకటేశ్, విద్యాసాగర్, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

‘స్వర్ణాంధ్ర’ ప్రణాళికలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు సంబంధించి 2024 నుంచి 2028-29 వరకు కార్యాచరణ ప్రణాళికను మే 31 లోపు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి అందజేయాలన్నారు. ఈ కసరత్తులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని ఆదేశించారు. విద్య, వైద్యం, పారిశ్రామిక, వ్యవసాయ, ఇతర రంగాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి సంబంధించి అంశాల సమగ్ర వివరాలు సిద్ధం చేయాలన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో విద్యారంగానికి సంబంధించి డిగ్రీ కళాశాలలు, కేజీబీవీ, పాఠశాలల్లో అదనపు తరగతులు అవసరం ఉన్నట్లు తెలిపారు. వైద్య రంగంలో వంద పడకల ఆసుపత్రుల నిర్మాణం, మౌలిక వసతులు, పలు అంశాలపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సీపీఓ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు, ఇతర శాఖల అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, విజయకుమార్, శ్రీదేవి, రవికుమార్, గోపాల్‌నాయక్, వెంకటేశ్వరి, సుధారణి, చెన్నయ్య, హరీష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 66,503మంది స్వామివారిని దర్శించుకోగా 23,941 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇక, సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని, కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని టీటీడీ స్పష్టం చేసింది.

చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రూపొందించిన చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డీఆర్ఓ మోహన్ కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ.. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 2016లో చట్టాలను సవరించిందన్నారు. ఈ చట్టాలను అనుసరించి విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమం కోసం అమలు చేయాల్సిన కార్యక్రమాలకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ర్యాంప్‌లు , వీల్ చైర్‌లు అందుబాటులో ఉండాలన్నారు. విభిన్నప్రతిభావంతులకు నిబంధనల మేరకు బస్సు, రైల్వే పాస్‌లను మంజూరు చేయాలని తెలిపారు. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సబ్సిడీ రుణాలను మంజూరు చేయించాలన్నారు. కమ్యూనిటీ హాల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్ నాయకులు డీఆర్ఓ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

‘ద్రావిడం’.. తిరోగమనం!

ద్రవిడ వర్సిటీకి అనుబంధ కష్టాలు పెరిగాయి. జిల్లాలోని కళాశాలలు వర్సిటీకి అనుబంధంగా చేయకపోవడంతో ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. కొన్ని కోర్సుల్లో విద్యార్థులు చేరక ఆ బ్రాంచ్‌లు మూతపడ్డాయి. కొత్త కోర్సులు లేకపోవడంతో విద్యార్థులు వర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. న్యాక్ గ్రేడ్ లేకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. సొంత జిల్లా వాసి సీఎంగా ఎన్నికవడంతో వర్సిటీ అధికారులు గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడుస్తున్నా వర్సిటీ అభివృద్ధిపై పాలకులు నోరు మెదకపోవడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది.

- అభివృద్ధికి దూరంగా వర్సిటీ
- జిల్లాలోని కళాశాలల అనుబంధం సాధ్యమేనా?
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపునకు రంగం సిద్ధం!



ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం రోజు రోజుకు అభివృద్ధిలో తిరోగమన దిశగా పయనిస్తోంది. వర్సిటీలో అభివృద్ధి కంటే వివాదాలే ఎక్కువ నడుస్తున్నాయి. కనీసం వర్సిటీకి మెరుగైన న్యాక్ గ్రేడింగ్ రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. ద్రవిడ వర్సిటీని ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తామని ఎన్నికల హామీలో ప్రకటించిన కూటమి ప్రభుత్వం నేటికీ వర్సిటీలో ఎలాంటి మార్పు తీసుకురాకపోగా కనీసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏడాదికి పైగా జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. దీంతో ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దారుణమైన పరిస్థితులు దాపురించాయి. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీకి తగినన్ని నిధులు ఇవ్వకపోగా కళాశాలల అనుబంధం అనుమతి దక్కలేదు. కొత్త కోర్సులు ప్రవేశ పెట్టకుండా ఉండడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

ఎటూ తేలకపోవడం

ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి వేరుగా విడిపోవడంతో చిత్తూరు జిల్లాలో ఏకైక వర్సిటీగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఉంది. దీంతో జిల్లాలోని అన్ని కళాశాలలను ద్రవిడ వర్సిటీకి అనుబంధం చేస్తే రెవెన్యూ మెరుగై వర్సిటీ అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు కళాశాలల అనుబంధం కార్యరూపం దాల్చలేదు. ఇందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి చిత్తూరు జిల్లాలుగా విడిపోయినా వీటికి సంబంధించిన బార్డర్లు తేలకపోవడంతో కళాశాలల అనుబంధం కష్టతరంగా మారింది. అయితే ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కళాశాలలు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నడుస్తున్నాయి. చిత్తూరు జిల్లాలోని కళాశాలలను ద్రవిడ వర్సిటీకి అనుబంధం చేస్తే ఎస్వీ వర్సిటీ రెవెన్యూకు గండికొట్టినట్లు అవుతుందని.. దీనిపై ఎస్వీ వర్సిటీ కోర్టును సైతం ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ద్రవిడ వర్సిటీకి ఇప్పట్లో చిత్తూరు జిల్లాలోని కళాశాలల అనుబంధం కష్టతరంగానే కనిపిస్తోంది.

ఆసక్తి చూపని విద్యార్థులు

ద్రావిడ వర్సిటీలో ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. వర్సిటీని పలు శాఖల్లో విద్యార్థులే లేకపోవడం గమనార్హం. దీంతో పాటు ద్రవిడ వర్సిటీలో చేరేందుకు విద్యార్థులు సుముఖత చూపడం లేదు. అదే విధంగా ఇక్కడ అధ్యాపకులు విద్యార్థులను ఆకర్షించడంలో విఫలమవుతున్నారు.

ఉద్యోగుల కొనసాగింపుపై అనుమతి రాకపోవడం

ద్రావిడ వర్సిటీలో విధులు నిర్వహిస్తున్న 235 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు సగానికి పైగా ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం . వర్సిటీలోని ఉద్యోగులకు ఇప్పటికే 12 నెలలకు పైగా జీతాలు ఇవ్వక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి వర్సిటీ అధికారులు 235 మందికి ఫైనాన్స్ అప్రూవల్ ఇవ్వాలని వినతి చేశారు. దీనిపై ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంత మందికి అప్రూవల్ ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పినట్లు సమాచారం. వర్సిటీలోని విద్యార్థులు, శాఖలు వంటి ప్రామాణికతకు తగ్గట్టు ఎంత మేరకు అవసరమో తెలిపితే అంత మందికి మాత్రమే అప్రూవల్ ఇచ్చేందుకు సుముఖం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో వర్సిటీ అధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అయితే వర్సిటీలో 235 మంది ఉద్యోగులు దాదాపు 15 సంవత్సరాలకు పైగా విధులు నిర్వహిస్తున్నవారే. ఇన్ని సంవత్సరాలు వర్సిటీలో విధులు నిర్వహిస్తూ.. వర్సిటీనే నమ్ముకుని తాము ఉద్యోగాలు చేస్తున్నామని, ఉద్యోగాలు కోల్పోతే తాము ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క ఉద్యోగిని తొలగించిన ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

‘పొదుపు’ డబ్బులు రూ.32 లక్షలు స్వాహా



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

పుంగనూరు : చిత్తూరు జిల్లా పుంగనూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒక ఆర్పీ.. మహిళలు ప్రతి నెలా పొదుపు చేసిన రూ.32 లక్షలను స్వాహా చేశారని మంగళవారం గ్రూపు మహిళలు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు పట్టణంలోని వైభవ్ లక్ష్మీ సమాఖ్యలో 280 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. రెడ్డిరాణి తన చేతివాటం ప్రదర్శించి, మహిళల వద్ద వసూలు చేసిన రూ.32 లక్షల రూపాయలు గత ఏడాది కాలంగా బ్యాంకులో పొదుపు చేయకుండా స్వాహా చేశారు. దీనిపై సభ్యులకు అనుమానం వచ్చి బ్యాంకు ఖాతాలను పరిశీలించగా పొదుపు చేసిన నిధులు బ్యాంకులో జమ కాకపోవడంతో స్వాహా అయినట్లు నిర్ధారించుకున్నారు. మంగళవారం పుంగనూరుకు వచ్చిన డీఎస్పీకి మహిళా సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. సమావేశంలో సీఐ రామ్‌భూపాల్, ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో రైల్వే ఐజీ

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంకు మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఐజీ అరోమాసింగ్ ఠాగూర్ విచ్చేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి దగ్గరుండి స్వామి సేవలు కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితుల ఆశీర్వచనాలు చేయించారు. స్వామి ప్రసాదం, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రవీంద్రబాబు, రైల్వే అధికారులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

15న ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 15వ తేదీన ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రముఖ కంపెనీల్లో అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేసేందుకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాను అర్హత, ఆసక్తి ఉన్న ఐటీఐ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 15 వ తేదీ ఉదయం 9 గంటల నుంచి అప్రెంటీస్ మేళా నిర్వహిస్తామన్నారు. ఈ మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చదివిన విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐబీఎం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో నేరుగా కళాశాలలోని కార్యాలయంలో సర్టిఫికెట్‌లతో మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9030657957 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

ఇంట్లో రూ.2 లక్షల వస్తువుల చోరీ

పలమనేరు : పట్టణ సమీపంలోని ఎక్స్‌ప్రెస్ హైవే సమీపంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి జరిగిన చోరీలో దాదాపు రూ.2 లక్షల విలువైన సామగ్రి చోరీ అయినట్లు బాధితుడు పుష్పరాజ్ మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎక్స్‌ప్రెస్ హైవే పనుల కారణంగా ఆయన తన ఇంటికి తాళం వేసి పట్టణంలోని స్వగృహంలో నివాసం ఉంటున్నారు. గమనించిన దొంగలు సోమవారం రాత్రి ఇంటి కిటికీలను తొలగించి ఇంట్లోని 10 హెచ్‌పీ టెక్స్‌మో మోటార్, 450 అడుగుల కేబుల్, మరో సింగిల్ హెచ్‌పీ మోటార్, ఇంట్లోని 200 కిలోల పాత ఇనుప సామగ్రిని చోరీ చేశారు. వీటిని ఓ వాహనంలో వేసుకొని వెళ్లినట్లు ఇంటి ముందు టైర్ల గుర్తులు కనిపిస్తున్నాయి. ఇక్కడ చుట్టు పక్కల ఎలాంటి నివాసాలు లేకపోవడంతో దొంగలు తెలివిగా దీనిపై టార్గెట్ చేసి చోరీ చేసినట్లుగా తెలుస్తోంది. మంగళవారం ఇంటికెళ్లిన బాధితుడు జరిగిన చోరీని చూసి వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటిగ్రేటెడ్‌తో ధరహాసం

దక్కని గిట్టుబాటు.. దిగుబడి నేలపాలు.. కర్షకుడు కుదేలు..ఈ స్థితి నుంచి వారిని గట్టెక్కించడానికి పలమనేరులో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ గతంలో శ్రీకారం చుట్టింది. ఆ పనుల్లో ప్రస్తుతం కదలికలు వచ్చాయి. ఈ విఫణి నిర్మాణం పూర్తయితే.. సౌకర్యాలు మెరుగు.. వ్యాపారుల రాకతో పుడమి పుత్రులకు మంచి మద్దతు ధర లభించనుంది. ఫలితంగా అన్నదాతలకు లాభం చేకూరనుంది.

- కొత్త మార్కెట్‌పైనే టమాట రైతుల ఆశలు
- క్యాటిల్‌ఫామ్ వద్ద 33 ఎకరాల్లో త్వరలో పనులు ప్రారంభం
- వ్యాపారులకు, రైతులకు అన్ని సౌకర్యాలు


క్యాటిల్‌ఫామ్ వద్ద మోడల్ మార్కెట్ నిర్మించనున్న స్థలం

పలమనేరు: పట్టణ సమీపంలోని చెన్నై- బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకుని క్యాటిల్ ఫామ్ వద్ద ఇంటిగ్రేటెడ్ టమాట మార్కెట్ నిర్మాణంతో రైతులకు ఎంతగానో మేలు చేకూరనుంది. ఈ పనులకు సంబంధించి స్థానిక మార్కెటింగ్ శాఖ కొత్త డీపీఆర్‌తో అంచనాలను పెంచి, మళ్లీ ప్రభుత్వానికి పంపింది. తాజాగా ఈ పనులన్నీ త్వరలో మొదలు కానున్నాయి. ఈ మార్కెట్ పూర్తి అయితే టమాట రైతులు కష్టాలు తీరినట్టే. ఇక్కడ పూర్తి సౌకర్యాలతో 33 ఎకరాల్లో నిర్మించే ఈ మార్కెట్‌కు భారీగా ఇతర రాష్ట్రాల వ్యాపారులు రావడంతో రైతులకు ధర పెరిగి అన్ని అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది.

ఇతర రాష్ట్రాల వ్యాపారులు వచ్చే అవకాశం....

ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా టమాట చెన్నైతో పాటు తమిళనాడులోని పలు జిల్లాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. ఇక్కడికి తమిళ వ్యాపారులు వస్తేనే ధరలు బాగా పలుకుతాయి. ప్రస్తుతం వీరు ఎక్కువగా కర్ణాటకాలోని వడ్డిపల్లి మార్కెట్‌కు వెళుతున్నారు. ఇక్కడ మార్కెట్ నిర్మాణం పూర్తయితే పెద్దసంఖ్యలో బయటి వ్యాపారులు ఇక్కడికి రావడం ఖాయం. మార్కెట్‌కు ఆనుకుని చెన్నై- బెంగళూరు, కృష్ణగిరి- అనంతపురం జాతీయ రహదారులున్నాయి. మార్కెట్ నిర్మించనున్న ప్రాంతం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో చైన్నై- బెంగళూరు సిక్స్‌ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో రోడ్ కనెక్టివిటీ పెరిగి సరుకు రవాణాకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతుకు మార్కెటింగ్ సౌలభ్యం పెరిగి, రైతులకు మంచి ధర లభించే అవకాశాలున్నాయి. ఈ విషయమై స్థానిక జిల్లా మార్కెటింగ్ అధికారి మహేశ్వర్‌ను వివరణ కోరగా మరో రెండు నెలల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

మార్కెట్ నిర్మాణానికి చర్యలివీ

టమాట మార్కెట్ నిర్మాణం కోసం ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన 33 ఎకరాల భూమిని మార్కెటింగ్‌శాఖ కొనుగోలు చేసింది. ఇందుకు సంబంధించి మొత్తం రూ.1.45 కోట్లు కాగా ఈ మొత్తాన్ని మూడు వాయిదాలో యూనివర్సిటికీ ప్రభుత్వం చెల్లించాలి. గత ప్రభుత్వం రూ.36 లక్షలను చెల్లించింది. ఆపై రూ.72 లక్షలు మంజూరు చేయగా ఇటీవలే స్థానిక మార్కెటింగ్ అధికారులకు చేరాయి. ఈ నగదును యూనివర్సిటీకి చెల్లించే ప్రక్రియను అధికారులు ఇటీవలే చేపట్టారు. మరోవైపు గతంలో వేసిన అంచనాలను తప్పించి, కొత్త డీపీఆర్, కొత్త అంచనాలతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఇవన్నీ కార్యరూపం దాల్చి మరో రెండు నెలల్లో ఇక్కడ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

మోడల్ మార్కెట్‌గా..

ఇక్కడ గత ప్రభుత్వంలోనే భూమి చదును చేసే కార్యక్రమాలు కొంతమేర జరిగాయి. జిల్లాలోనే మోడల్ మార్కెట్‌గా ఉండాలనే లక్ష్యంతో 33 ఎకరాల్లో సువిశాలంగా అన్ని హంగులతో మార్కెట్ భవనాలకు అంచనా వేసి, నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ నమూనాను సైతం సిద్ధం చేశారు. అయితే ఈ ప్రభుత్వంలో డీపీఆర్ మారితే కొత్త నమూనాతో అంచనాలు పెంచారు. ఈ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వ్యాపార కార్యకలాపాలు పెరిగి, మూడు రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడికి రావడంతో గిట్టుబాటు ధర లభించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ ప్రాంతం అటు బెంగళూరు, ఇటు చెన్నై మహానగరాలు దగ్గరగా ఉండడడం వాటిని కలిపే జాతీయ రహదారి పక్కనే ఉండడం కలిసొచ్చే అంశంగా మారింది.

మార్కెట్ నిర్మాణం ఇలా..

జాతీయ రహదారికి ఆనుకుని వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నారు. మార్కెట్‌లో టమాట మండీలన్నీ ఓ వైపు, ఇతర కూరగాయల మండీలు మరోవైపు ఉండేలా గతంలో డిజైన్ చేశారు. మార్కెట్‌లో వాహనాల లోడింగ్, రైతులు తీసుకొచ్చే కూరగాయల వాహనాల కోసం 100 అడుగుల రోడ్లను నిర్మించనున్నారు. మార్కెట్ వచ్చిన కూరగాయలకు అక్కడిక్కడే ప్యాకింగ్, గ్రేడింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. రైతుల సౌకర్యార్థం క్యాంటీన్లు, విశ్రాంతి గదులు తదితర నిర్మాణాలు ఉంటాయి. దీనికి సమీపంలోనే పశువులు, గొర్రెల వారపుసంతలుంటాయి. జిల్లాలోనే దీన్ని మోడల్ మార్కెట్‌గా చేయాలనే సంకల్పంతో మార్కెటింగ్ శాఖ భావిస్తోంది.



సకాలంలో వ్యవసాయ సర్వీసులు

చిత్తూరు కార్పొరేషన్ : సకాలంలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. మంగళవారం అర్బన్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఇన్ని రోజులు మెటీరియల్స్ కొరతతో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం జిల్లా స్టోర్స్‌కు మెటీరియల్స్ వచ్చిందన్నారు. ఏఈలు సీనియార్టీ వారిగా వాటిని పంపిణీ చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 11 కేవీ లైన్లను సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. సెక్షన్ల వారీగా లోడ్ మానిటరింగ్ చేసి ఎక్కడెక్కడ ఓవర్‌లోడ్ ఉందో గుర్తించి అదనపు సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టాలన్నారు. వేసవిలో ఎక్కువగా ట్రిప్పింగ్ సమస్యలు వస్తాయని ఎప్పటికప్పుడు సిబ్బంది వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డీఈలు ప్రసాద్, ఆనంద్, కొండయ్య, ఏఏఓ గీత, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

వాహనం ఢీ.. ఒకరి మృతి


మృతుడు యోగరాజు

సదుం : రోడ్డు ప్రమాదంలో టెంపో వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సదుం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బంగారు పాళ్యెం మండలం తుమ్మపాళ్యెంకు చెందిన యోగరాజు(40) ద్విచక్ర వాహనంలో కల్లూరు నుంచి సదుంకు బయలుదేరారు. అయితే మార్గ మధ్యలోనే ఒక డెయిరీ సమీపంలో తిరుపతికి వెళుతున్న టెంపో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యోగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సదుం పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



సదుం : మండలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పశువుల కాపారులు గుర్తించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. గొంగివారిపల్లె సమీపంలోని రెడ్డివారికుంటలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండగా పశువుల కాపారులు గుర్తించారు. ఈ విషయాన్ని సదుం పోలీసులకు తెలియజేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాల నుంచి 50 వరకు ఉంటుందని నీలం రంగు లుంగీ, గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని తెలిపారు. పక్కనే మద్యం తాగిన బాటిళ్లు ఉన్నాయని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం దోపిడీ ఘటనలో మరో ఐదుగురు అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట : ఇటీవల ఏపీ, కర్ణాటక సరిహద్దులో ఓ కారును అడ్డగించి బంగారు బిస్కెట్లను దోపిడీ చేసిన కేసులో 14 మంది నిందితుల్లో ఐదుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ తెలిపారు. మంగళవారం వి.కోట పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 2వతేదీన మండలంలోని పేర్నంబట్ జాతీయ రహదారిలోని నాయకనేరి ఘాట్‌లో వస్తున్న కారును 14 మంది అడ్డగించి రూ 3.394 కేజీల బంగారు బిస్కెట్లను దోపిడీ చేశారు.
బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం రెండు రోజుల్లోనే నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొత్తం బంగారాన్ని రికవరీ చేసిన విషయం విదితమే. అయితే నిందితుల్లో మరో ఐదుగురిని సోమవారం సాయంత్రం అరెస్ట్ చేశారు. నిందితులు తమిళనాడు రాష్ట్రం పెర్నంబట్‌లోని కల్లిపెట్టై గ్రామానికి చెందిన పన్నీర్ సెల్వం కుమారుడు వేదాచలం (44), మసిగం గ్రామానికి చెందిన పెరుమాళ్ కుమారుడు కుమరేసన్ (పటాస్) (39), కల్లీపేట గ్రామానికి చెందిన శంకర్ కుమారుడు రంజిత్ (35), కల్లిపేట గ్రామానికి చెందిన విజియన్ బంగారు కుమారుడు దీపక్ చక్రవర్తి విజయన్ (42), కల్లీ పేట గ్రామానికి చెందిన మరి కుమారుడు సూరవేల్(48)గా గుర్తించారు.

ఓ నిందితుడు ఆత్మహత్య

- తన ఆత్మహత్యకు స్నేహితులే కారణమంటూ ఆడియో
- తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్ సమీపంలో ఘటన


అప్పు (ఫైల్)

వి.కోట : మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలో వారం రోజుల క్రితం జాతీయ రహదారిపై చోటు చేసుకున్న బంగారు దోపిడీ కేసులో 8వ నిందితుడుగా ఉన్న తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం తమిళనాడులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 2వ తేదీన ఏపీ, కర్ణాటక సరిహద్దులో జాతీయ రహదారి ఓ కారును అడ్డగించి బంగారు బిస్కెట్లను దోపిడీ చేసిన కేసులో 14 మంది తమిళనాడు వాసులపై వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో కొందరిని ఇప్పటికే అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా తమిళనాడు రాష్ట్రం పేర్నంబట్ సమీపంలోని గుండ్లపల్లెకు చెందిన జైపాల్ కుమారుడు అప్పు (32) మంగళవారం తన స్వగ్రామంలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకునే ముందు తన స్నేహితులు కావాలనే తనను తీసుకెళ్లి బంగారు దోపిడీ కేసులో ఇరికించారని.. తనకు ఏ పాపం తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ ఆడియో వాట్సాప్ ద్వారా పలువురికి పంపాడు. కాగా ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్న తమ బిడ్డను స్నేహితులు అకారణంగా కేసుల్లో ఇరికించి అతని మృతికి కారణమయ్యారంటూ అప్పు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

భార్య ముఖంపై యాసిడ్.. భర్త అరెస్టు

చిత్తూరు అర్బన్ : భార్య కాపురానికి రాలేదనే కోపంతో ఆమె ముఖంపై యాసిడ్ పోసిన భర్తను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. చిత్తూరు టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. నగరంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన దావూద్ , రేష్మ దంపతులకు మనస్పర్థలు రావడంతో కొద్దికాలంగా విడివిడిగా ఉంటున్నారు. వీళ్లకు ఇద్దరు పిల్లలు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న దావూద్ సోమవారం రేష్మ ఇంటికి వచ్చాడు. కాపురానికి రావాలని ఆమెను బలవంతం చేయగా రేష్మ అంగీకరించలేదు. దీంతో వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను రేష్మ ముఖంపై పోసేశాడు. యాసిడ్ పెదాలపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిని అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. దావూద్‌ను రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

డీఎంహెచ్‌ఓలో ఆధిపత్య పోరు!

కాణిపాకం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇద్దరు అధికారుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. కార్యాలయంలో తమ పెత్తనమే సాగాలంటూ ఢీ అంటే ఢీ అంటున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇద్దరు సూపర్‌మేన్లు ఉన్నారు. ఆ సూపర్ మేన్‌లను కార్యాలయ అధికారులు, సిబ్బంది కత్తి..కొండ అని ఆ ఇద్దరిని మారుపేర్లతో పిలుస్తుంటారు. కొన్నాళ్లుగా వీరి మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఈ ఇద్దరు నువ్వా..నేనా అంటూ కత్తులు నూరుతున్నారు. లేకుంటే నేనే పెద్ద..నాదే పెత్తనమంటూ కొండెక్కి కూర్చుంటున్నారు. ఈ పోరు ప్రస్తుతం కార్యాలయంలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. తొలుత కార్యాలయంలో కత్తికే పదును ఉండేది. కొత్తగా వచ్చిన ఓ మేడం వల్ల కత్తికి పవర్ కట్ చేశారు. ఇంతలో కొత్తగా వచ్చిన కొండకు ఆగమేఘాల మీద బలమిచ్చారు. పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్నారు. దీంతో కొండ అంతా తానై వ్యవహరిస్తోంది. దీంతో కొండ చేసే పనులన్నింటిపై ఆ కత్తి కత్తికట్టింది. మేడం..మేడం అంటూ వెంటపడి మేడం చెవిలో నూరింది. నిజమా..కాదా అని ఆరా తీస్తే కొండ బండారం మొత్తం బయటపడిందంటా. ఇప్పుడు ఆ మేడంకు ఎవరికి సూపర్ పవర్ ఇవ్వాలో తెలియక తికమక పడుతోంది.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

- బాలికను గర్భిణిని చేసిన మోసగాడు
- పోక్సో , ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

చౌడేపల్లె : మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ లోబర్చుకొని... పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను ఆరునెలల గర్భిణిని చేసిన ఘటన చౌడేపల్లె మండలంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. సుమారు 15 ఏళ్ల వయస్సు గల బాలికను అదే గ్రామానికి చెందిన నాగేంద్ర మాయ మాటలు చెప్పి శారీరకంగా కోరికలు తీర్చుకొని మోసం చేశాడని బాలిక, ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై నాగేంద్రను నిలదీయడంతో బాలిక తల్లిదండ్రులను కులం పేరుతో దూషించడంతో పాటు, గ్రా మం విడిచి వెళ్లిపోవాలని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగేంద్రతో పాటు అతని తల్లిదండ్రులు లక్ష్మన్న, విజయలక్ష్మిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పోక్సో యాక్ట్ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

అక్రమాస్తుల కేసులో మళ్లీ సోదాలు

- గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన చంద్రగిరి పంచాయతీ ఈవో

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య లంచం తీసుకుంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఏసీబీకి చిక్కారు. అధికారులు ఆయనను కస్టడీలోకి తీసుకుని కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. అయితే సరిగ్గా నెల రోజుల తర్వాత ఆయన ఇంటిపై మరోసారి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఇంట్లోని పలు కీలక డాక్యుమెంట్లను సీజ్ చేసినట్లు సమాచారం.

ఆదాయానికి మించి ఆస్తులు

తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ సమీపంలోని ఏకదంతా అపార్ట్‌మెంట్‌లో ఉన్న మహేశ్వరయ్య ప్లాటుకు మంగళవారం ఉదయమే ఏసీబీ అధికారులు చేరుకున్నారు. అతని కుటుంబీకులకు సంబంధించిన దస్త్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బంగారం, వెండికి సంబంధించిన బిల్లులు, స్థిరాస్తులకు సంబంధించిన దస్తావేజులను పరిశీలించి.. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కన మహేశ్వరయ్యను జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే సస్పెండ్ చేయగా మరోసారి ఆయన ఇంట్లో సోదాలు చేయడం చర్చనీయాంశమైంది. మహేశ్వరయ్య ఇంటితో పాటు కారు, ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. ఇప్పటివరకు నిర్వహించిన సోదాల్లో సుమారుగా మార్కెట్ విలువ ప్రకారం రూ.30 కోట్ల విలువైన అక్రమ ఆస్తులు కూడబెట్టినట్లు అధికారులు అంచనా వేసినట్టు సమాచారం. అయితే అధికారికంగా ఏసీబీ అధికారులు సోదాలు పూర్తయిన తరువాత పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

దొంగ-పోలీసు ఆటలో తొలి వికెట్!

– చిత్తూరు సీఐను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆదేశాలు


సాక్షి ఎఫెక్ట్..



చిత్తూరు అర్బన్ : అరెస్టు చేసిన దొంగ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేశారని ఆరోపణలపై చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు చర్యలకు ఉపక్రమించారు. చిత్తూరు వన్ టౌన్ సీఐ జయరామయ్యను వేకంట్ రిజర్వ్(వీఆర్)కు పంపుతూ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు నగరంలోని దొడ్డిపల్లి వద్ద ఈ ఏడాది జనవరి నెలలో ఓ ఇంట్లో భారీ మొత్తంలో బంగారం, నగదు చోరీకి గురైంది. దీనిపై కేసు నమోదు చేసిన వన్ టౌన్ పోలీసులు.. నిందితులను అరెస్టు చేసి దాదాపు రూ.20 లక్షల వరకు రికవరీ చేశారు. అయితే ఇదే కేసులో నిందితుడుగా ఉన్న ఓ వ్యక్తి రాయచోటిలో చోరీకి పాల్పడటం, అక్కడి పోలీసుల విచారణలో చిత్తూరు పోలీసులు తన వద్ద నుంచి దాదాపు రూ.12 లక్షల వరకు నగదు కాజేశారు అంటూ చెప్పడం జిల్లా పోలీసు శాఖను కుదిపేసింది. ఈ కేసులో ఇద్దరు పోలీసులతో పాటు ముగ్గురు కానిస్టేబుల్ ప్రమేయం ఉందనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ ఘటనపై సాక్షి పత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దొంగ నుంచి రికవరీ చేసిన సొమ్మును బాధితులకు ఇవ్వాల్సింది పోయి.. పోలీసులు వాటాలు పంచుకోవడంపై అనంతపురం రేంజ్ డీఐజీ, చిత్తూరు ఎస్పీ సీరియస్‌గా పరిగణించారు. ఈ ఆరోపణలపై లోతుగా విచారణకు ఆదేశిస్తూ, చిత్తూరు అదనపు ఎస్పీ రాజశేఖర్ రాజును విచారణ అధికారిగా నియమించారు. నిశితంగా విచారించిన అదనపు ఎస్పీ.. ప్రాథమిక నివేదికను ఎస్పీకి అందజేశారు. ప్రాథమిక విచారణ ఆధారంగా సీఐ జయ రామయ్యను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న మహేష్ కు వన్ టౌన్ సీఐ అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు పేర్కొన్నారు. మరికొందరు పోలీసుల పైనా క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దొంగ నుంచి డబ్బులు తీసుకోవడం అనేది ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంపై క్రిమినల్ కేసు నమోదు చేసే దిశగా ఎస్పీ న్యాయ సలహాలు తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే అనంతపురం డీఐజీ సిమోషితో చర్చించినట్లు సమాచారం. ఈ ఘటన ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

ప్రేమించకుంటే కాల్చేస్తా

- యువతిని ప్రేమించమని వెంటపడిన యువకుడు
- తన ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టి జీభత్సం
- ఇంట్లో నుంచి రాకుంటే ఇలాగే కాల్చేస్తానని బెదిరింపులు


నిందితుడు గిరి


నిందితుడు నిప్పుపెట్టిన ద్విచక్రవాహనం

పుంగనూరు : మండలంలో ఓ యువతిని ప్రేమించమని వెంటపడ్డాడు.. ఆమె ఇంటి ముందు తన ద్విచక్ర వాహనానికి నిప్పంటించాడు..ప్రేమను అంగీకరించకుంటే ఇదే విధంగా పెట్రోలు పోసి కాల్చివేస్తానని మంగళవారం రాత్రి బీభత్సం సృష్టించాడు. మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గిరి అనే యువకుడు పూజగాని పల్లెకు చెందిన ఓ యువతిని చాలారోజుల నుంచి ప్రేమించమని వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పూజగానిపల్లెలోని ఆ యువతి ఇంటికి చేరుకున్నాడు.
ఇంట్లో నుంచి బయటకు రమ్మని కేకలు వేశాడు. ఆమె ఇంటిలో నుంచి బయటకు రాకపోవడంతో రెచ్చిపోయి తాను తెచ్చిన ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి యువతి ఇంటి ముందు తగులబెట్టాడు. తన ప్రేమను అంగీకరించకపోతే ఇలాగే పెట్రోలు పోసి కాల్చివేస్తానంటూ ఆ యువతిని బెదిరించాడు. ఈ సంఘటనతో గ్రామస్తులు భయాందోళనకు లోనయ్యారు. వెంటనే అప్రమత్తమై అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించారు. అతను పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రాంభూపాల్ ఆదేశాల మేరకు ఎస్ఐ లోకేష్ సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాలిపోయిన వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా గ్రామస్తులు తెలిపిన మేరకు నిందితుడు మరికొంత మంది యువకులతో కలసి ఆ ప్రాంతంలో గంజాయి వ్యాపారం చేస్తుంటాడని.. గంజాయి మత్తులో యువతిని రోజూ వేధించేవాడని ఆరోపించారు.